సాక్షి
కుమురం భీం

బుధవారం, 1, మార్చి, 2023



యాసంగిలో తెగుళ్ల బెడద
యాసంగి పంటలను చీడపీడలు ఆశిస్తు న్నాయి. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజేశ్వర్‌నాయక్ సూచిస్తున్నారు. 8లో ▸



ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనా..?
శివగూడ గ్రామంలో గిరిజనుల కోసం ఐటీడీఏ మోడల్ గృహాలు నిర్మిస్తోంది. ఇక్కడ 13 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా, ఇప్పటివరకు ఒక్కటి మాత్రమే పూర్తయింది. 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /19.2

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14416

ఆసిఫాబాద్‌అర్బన్: పరీక్షల సందర్భంగా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ 14416ను అందుబాటులోకి తెచ్చిందని డీఐఈవో శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల సమయంలో ఒత్తిడితో విద్యార్థులు సమస్యలను బయటికి చెప్పుకోలేక బాధపడుతుంటారని ఆయన పేర్కొన్నారు. ఒత్తిడి, భయం, ఆందోళన, జ్ఞాపకశక్తి తదితర విషయాలపై టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి, కౌన్సెలర్లుతో మాట్లాడొచ్చని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో మూడు బీఏఎంఎస్ వైద్యాధికారి, రెండు యునాని వైద్యాధికారి, కాంట్రాక్ట్ ఎన్‌హెచ్‌ఎం పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://asifabad.telangana.gov.inను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 6 సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

అర్హుల ఎంపికలో అభ్యంతరాలుంటే తెలపండి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలం చారిగాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అర్హుల జాబితాను మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో అంటించడంతోపాటు 30 వార్డుల్లో అందుబాటులో ఉంచామని, అభ్యంతరా లు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ ప్ర మోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎస్. అంజయ్య మంగళవారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. అర్హుల జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే మార్చి 2 వరకు తహసీల్దార్, కమిషనర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అలాగే అర్హత ఉండి వారి పేర్లు జాబితాలో లేకపోయినా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అధ్యయన యాత్రను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే విద్యారంగ సమస్యల అధ్యయన యాత్రను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, బీసీ గురుకులాలు, జూనియర్ కళాశాలల్లో సమస్యలను అధ్యయనం చేసి, నివేదికలను కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులకు అందజేస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు విడతల వారీగా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, బాలేశ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, నాయకులు మారుతి పటేల్, గడ్డల ప్రణయ్, చరణ్, తరుణ్, సాగర్ పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తిర్యాణి(ఆసిఫాబాద్): పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల అన్నారు. మండలంలోని గిన్నెదరి, చెలిమల బాలికల ఆశ్రమ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. అక్షర జ్యోతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వారు పరిశీలించారు.

పక్కాగా ఇంటర్నల్



కౌటాలలో ఇంటర్నల్ మార్కుల పరిశీలన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సభ్యులు

- ఉన్నత పాఠశాలల్లో పూర్తయిన తనిఖీలు
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో ఇంటర్నల్ మార్కుల నమోదు
- జిల్లాలో 6,671 మంది పదో తరగతి విద్యార్థులు

కౌటాల(సిర్పూర్): పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్లు సాధించేందుకు విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు ఎంతో కీలకం. అయితే ఇంటర్నల్ మార్కులు ఆయా పాఠశాలల యాజమాన్యాల చేతుల్లోనే ఉండటంతో కొంత మంది ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంటర్నల్ మార్కుల కచ్చితత్వాన్ని తెలుసుకోవాలంటే విద్యార్థులు రాసిన ఫార్మెటివ్ అసెస్‌మెంట్ లిస్ట్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. దీంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఫిబ్రవరి 20 నుంచి 28 వరకు జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఇంటర్నల్ మార్కులను పరిశీలించింది. మంగళవారంతో పరిశీలన పూర్తికావడంతో బుధవారం నుంచి ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

ఇంటర్నల్ మార్కులు కీలకం..

జిల్లాలో మొత్తం 155 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 6,671 మంది పదో తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరూ 2022– 23 విద్యా సంవత్సరంలో వార్షిక పరీక్షలకు రాయనున్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. ప్రాజెక్టులు, రికార్డులతోపాటు పరీక్షలు నిర్వహించి మార్కులు నమోదు చేశారు. అయితే పరీక్షలు పక్కాగానే నిర్వహించారా..? విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే మార్కులు వేశారా.. లేదా..? అనే అంశాలను ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారు. ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ 19 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. సాధారణంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ టెస్టులకు 20 మార్కులు కేటాయిస్తారు. అలాగే ప్రాజెక్టులకు ప్రత్యేకంగా మార్కులు ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా మార్కులు వేస్తారు. కానీ ప్రైవేట్ పాఠశాలల్లో కొంత మంది నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులకు 10/10 గ్రేడ్ రావాలనే ఉద్దేశంతో ఇంటర్నల్ మార్కులు పూర్తిగా వేస్తున్నారనే అపవాదు ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో ఇంటర్నల్ మార్కుల పరిశీలన మంగళవారంతో ముగిసింది. తనిఖీ బృందాల సభ్యులు విద్యార్థుల మార్కులను పూర్తిగా పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నేటి నుంచి మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సూచించారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఆసిఫాబాద్: పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆదేశాలనుసారం బుధవారం నుంచి ఈ నమోదు ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. టీం లీడర్ సర్టిఫై చేసిన తర్వాత విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను అప్‌లోడ్ చేసి, మొదట ప్రింట్ అవుట్ తీసుకోవాలన్నారు. విద్యార్థులు, సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత ఎంఈవో పరిశీలన అనంతరం ధ్రువీకరించాలని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాను ఈ నెల 5లోగా సమర్పించాలన్నారు.

మెరుగైన విద్యనందించడమే లక్ష్యం



కౌటాలలో పాఠశాలను ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు, డీఈవో అశోక్

- జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు
- 'మన ఊరు– మన బడి' పాఠశాలలు ప్రారంభం

కౌటాల(సిర్పూర్): పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు అన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా కౌటాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.17.38 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టగా, మంగళవారం డీఈవో అశోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంఈవో సోమయ్య, సర్పంచ్ పొజ్జల మానిశ్, హెచ్‌ఎం ఎంఎల్ రాజు, నాయకులు మధుకర్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం

చింతలమానెపల్లి(సిర్పూర్): మన ఊరు– మన బడి కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన మండలంలోని పాల్వాయినగర్, బారెగూడ ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు, డీఈవో అశోక్ ప్రారంభించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, ఎంఈవో సోమయ్య, సర్పంచులు సుజాత, సుశీల, కోఆప్షన్ సభ్యుడు నాజీం, నాయకులు వెంకయ్య, మారుతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి సీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా 5లోగా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామికి కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపేందర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఆస్పత్రిలో కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచినప్పటికీ కాంట్రాక్టర్లు జీవో ప్రకారం చెల్లించడం లేదని ఆరోపించారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, నాయకులు, కార్మికులు హరీశ్, శ్రీశైలం, మమత, నీల, సువర్ణ, గుణవంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

వీవీప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు



వీవీప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ రాజేశం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో గల వీవీప్యాట్ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమీక్షంలో వీవీప్యాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

పోషకాహార వినియోగంపై అవగాహన కల్పించాలి



తయారీ విధానం గురించి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్: జిల్లాలో పోషకాహార వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంజలి మిల్లట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తహీనత సమస్యలను నివారించేందుకు పోషకాహారం ఎంతో అవసరమన్నారు. చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులను అడిగి మిషనరీ ఉపయోగించే విధానం, జొవార్, రాగి లడ్డూ తయారీ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. డీపీఎంలు రామకృష్ణ, యాదగిరి, అన్నాజీ, ఏపీఎం శ్రీనివాస్, సభ్యులు కృష్ణవేణి, సంగీత తదితరులు ఉన్నారు.

సైన్స్‌పై పట్టు సాధించాలి




మాట్లాడుతున్న డీఈవో అశోక్

- డీఈవో అశోక్

కౌటాల(సిర్పూర్): పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని గుండాయిపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. అలాగే మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.సోమయ్య, హెచ్‌ఎం హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికలు

- కోతులు, పందులు, పిచ్చి కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు
- కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి కృషి
- మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు వీలవుతోందని కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సామిడి అంజయ్య అన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. పట్టణ సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌తో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పలు వార్డుల నుంచి ప్రజలు సమస్యలు, ఇతర అంశాలను ఫోన్ ద్వారా కమిషనర్‌కు వివరించారు. వాటికి ఆయన సమాధానం ఇవ్వడంతో పాటు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రశ్న: వార్డు నంబర్– 8లో మాంసం దుకాణం ఉండటంతో దుర్వాసన వస్తోంది. వ్యర్థాలను వార్డు సమీపంలో పడేయటం ద్వారా ఇబ్బంది పడుతున్నాం.

– సత్యనారాయణ, 8వ వార్డు

కమిషనర్: వార్డులోని మాంసం దుకాణానికి లైసెన్సు లేకపోతే మూసి వేయిస్తాం. లైసెన్సు కలిగిన దుకాణం ఉంటే పశువుల వ్యర్థాలను అక్కడే పడేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వార్డు నంబర్– 4లో చికెన్ షాపు, బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. వీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– షహబాజ్ 4వ వార్డు

కమిషనర్: బెల్టు షాపు విషయాన్ని స్థానిక ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకెళ్తాం. బెల్టు షాపు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటాం. చికెన్ షాపు అనుమతితో నడిపిస్తే వ్యర్థాలు స్థానికంగా పడేయకుండా చూస్తాం.

ప్రశ్న: తైబానగర్‌కాలనీలో మూడు నెలల నుంచి మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటోంది. వార్డు ప్రజలు నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– రాజిక్, తైబానగర్‌కాలనీ

కమిషనర్: తైబానగర్ కాలనీలో మంచినీటి పైపులైన్ లీకేజీ కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న మాట వాస్తవమే. రెండు రోజుల్లో మంచినీటి పైపు లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి, మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

ప్రశ్న: ఎల్లాగౌడ్ తోటలో పిచ్చికుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రిపూట కాలనీలో బయటికి వస్తే దాడి చేసే ప్రమాదం ఉంది. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి.

– ఎం.రాజేందర్, ఎల్లాగౌడ్ తోట

కమిషనర్: పట్టణంలోని పలు వార్డుల్లో పిచ్చికుక్కల బెడద ఉన్నట్లు ఇటీవల మున్సిపల్ సమావేశంలో కూడా పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేకమైన జాలీలను తయారు చేయడానికి ఆర్డర్ ఇచ్చాం. వారం రోజుల్లో జాలీలు వచ్చిన తర్వాత పిచ్చి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించే దిశగా పని చేస్తాం.

ప్రశ్న: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో కోతుల బెడద అధికంగా ఉంది. ఉదయం, సాయంత్రం ఇళ్లలోకి ప్రవేశించి ఆహారం, విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి.

– విశాల్, అంబేద్కర్ కాలనీ

కమిషనర్: కుక్కల కోసం తయారు చేయించే జాలీలను కోతులను సైతం పట్టుకోవడానికి వినియోగిస్తాం. జాలీలు వచ్చిన తర్వాత ఒక రోజు కోతులను పట్టుకోవడానికి ఒక టీంను రంగంలోకి దింపుతాం. వాటిని అటవీ ప్రాంతంలో వదిలివేసేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న: కాగజ్‌నగర్ పట్టణ శివారు ప్రాంతమైన బుదరగూడ బ్రిడ్జి, త్రిశూల్ పహాడ్ జెడ్పీ స్కూల్ వద్ద కొందరు చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలను తీసుకువచ్చి పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వస్తోంది. వాహనాల మీద పట్టణానికి వస్తుండగా తీవ్రమైన వాసనతో ఇబ్బందవుతోంది.

– జుమిడి తిరుపతి, పట్టణవాసి

కమిషనర్: మటన్, చికెన్ వ్యర్థాలను ఆయా ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా పడేస్తున్న వ్యాపారులను గుర్తించి మున్సిపల్ తరఫున నోటీసులు అందజేస్తాం. పశువుల వ్యర్థాలను పట్టణ ప్రారంభం ప్రాంతంలో కాకుండా మున్సిపల్ చెత్త వాహనాల్లో వేయడానికి త్వరలోనే వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తాం.

ప్రశ్న: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే ఉన్న ప్రధాన మురికి కాల్వలో కొందరు పండ్ల వ్యాపారులు రాత్రిపూట కుళ్లిన పండ్లను పడేస్తున్నారు.

– నరేశ్, స్థానికుడు

కమిషనర్: పట్టణవ్యాప్తంగా స్వచ్ఛత పాటించాలని ఇప్పటికే వ్యాపారులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. త్వరలోనే పండ్ల వ్యాపారులను సైతం పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇస్తాం. పట్టించుకోని వ్యాపారులకు జరిమానా విధిస్తాం.

ప్రశ్న: మున్సిపల్ స్థలాలను కొందరు అక్రమంగా కబ్జా చేస్తున్నారు. ప్రధానంగా మురికి కాల్వకు ఆనుకుని ఉన్న స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారు.

– నూర్ హుస్సేన్, కాగజ్‌నగర్

కమిషనర్: మున్సిపాలిటీకి చెందిన భూముల రక్షణకు ఇప్పటికే కంచెలు ఏర్పాటు చేశాం. మురికి కాల్వకు ఆనుకుని ఉన్న స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. కొన్ని ఖాళీ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశాం. కబ్జాకు పాల్పడే వారిని గుర్తించి మున్సిపల్ భూమిని కాపాడుతాం.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): భూమిలోని సారం దెబ్బతినకుండా సేంద్రియ పద్ధతులతో కూడిన వ్యవసాయంతోనూ అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉన్నతి శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలు, రైతులు సహజ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. భూసారం దెబ్బతినకుండా సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. అలాగే వ్యవసాయ అనుబంధం రంగాలపై సైతం ఆసక్తి చూపాలన్నారు. తక్కువ పెట్టుబడితో సహజసిద్ధ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు, జీలుగు, పచ్చిరొట్టెను ఎరువులుగా వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడితే భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఈసీ నోడల్ అధికారి మల్లేశ్, ఏపీవో బుచ్చన్న, జేఆర్‌పీ ఆనంద్, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యవర్గం




వెంకటేశ్ రాములు

పాతమంచిర్యాల: తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు మంగళవారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైల్ల ఆశయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా తంగళ్లపల్లి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా పాయిరాల రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్, రాములు మాట్లాడుతూ.. రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రిటైర్డ్ డీజీఎం గోవిందరాజుకు సన్మానం



గోవిందరాజును సన్మానిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో పర్సనల్ డిపార్టుమెంట్ డీజీఎంగా పనిచేసి మంగళవారం రిటైర్డ్ అయిన గోవిందరాజును యాజమాన్యం ఘనంగా సన్మానించింది. జీఎం కార్యాలయం వద్ద జీఎం బీ సంజీవరెడ్డి, ఇతర అధికారులు, గుర్తింపు సంఘం నేతలు గోవిందరాజును ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్వోటూ జీఎం త్యాగరాజు, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదీర్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, సివిల్ జీఎం శ్రీనివాస్‌రావు, డీజీఎం (సివిల్) శివరావు, సీనియర్ పీవో కాంతారావు, రాజేశ్, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, జీఎం కార్యాలయ పిట్ సెక్రటరీ పీవీ రావు, సిబ్బంది రాజన్న, అఖిల తదితరులున్నారు.

మందమర్రి ఏరియాలో 88 శాతం బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఫిబ్రవరిలో 88 శాతం బొగ్గు ఉత్పత్తి చేశామని ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఏరియాలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేకే-5 గనిలో 15,264 టన్నులు, కేకే-1లో 12,170, ఆర్కే-1ఏలో 6,238, కాసిపేటగనిలో 9,158, కాసిపేట-2లో 6,097, శాంతిఖనిగనిలో 2,530, ఆర్కే ఓసీలో 1,94,523, కేకే-ఓసీలో 1,80,262 టన్నుల ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఏరియాలో ఆర్కే-1ఏ, కేకే-1 గనుల్లో బొగ్గు నిల్వలు పూర్తయినందున వాటిని మూసివేసేందుకు సంస్థ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఆ గనుల్లో విధులు నిర్వహించే ఉద్యోగులను ఏరియాలోని మిగతా గనుల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం కృష్ణారావు, ఎచ్‌వోడీ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, సీనియర్ పీఎం మైత్రేయబంధు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఓదెలు ఉన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్దిపల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల చిన్నయ్య (79) బలవన్మరణానికి పాల్పడ్డాడు. హాజీపూర్ ఏఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుద్దిపల్లికి చెందిన చిన్నయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా నయం కాలేదు. దీంతో మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

యాసంగిలో తెగుళ్ల బెడద



బెల్లంపల్లి: యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో చీడపీడలు ఆశించే అవకాశాలున్నాయి. రైతులు దృష్టి సారించి చీడపీడలు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త రాజేశ్వర్‌నాయక్ సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..



రాజేశ్వర్‌నాయక్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, బెల్లంపల్లి

- పంటలను ఆశిస్తున్న చీడపీడలు
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజేశ్వర్‌నాయక్

వరి పంటలో...

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావం మూలంగా వరిపైరును ప్రధానంగా కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పొలంలో పురుగును గమనించినట్లయితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా కార్ట్ అఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 జీ గుళికలు 4 కిలోలు వేయాలి. కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా వరిపంటను ఉల్లికోడు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. దీని నివారణకు రెండు మిల్లీలీటర్ల కార్బో సల్ఫాన్ లేదా పిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలి. లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా 6 కిలోల పిప్రోనిల్ 0.3 లేదా 4 కిలోల పిప్రోనిల్ 0.6 జీ గుళికలు వేసుకోవడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. వరిపంటను అగ్గితెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలెన్ 1.5 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో...

మొక్కజొన్న పంటను కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పంటచేనులో ఈ తెగులు కనిపించిన వెంటనే ఏమాత్రం జాప్యం చేయకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 1 గ్రాము కార్బండిజమ్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి. కత్తెర పురుగు ప్రభావం కూడా మొక్కజొన్నలో ఎక్కువగా కనిపిస్తోంది. ఈ పురుగు నివారణకోసం ఎకరాకు 0.4 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిప్రోల్ లేదా 0.5 మిల్లీలీటర్ల స్పైనటోరం రసాయనాన్ని లీటరు నీటిలో కలిపి ఆకుల సుడులు తడిచేలా పిచికారీ చేయాలి.

జొన్నపంటలో...

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల జొన్నపంటను పేనుబంక పురుగు ఆశించే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. పంటచేనులో పురుగును గుర్తించినట్లయితే దీని నివారణకు 2 మిల్లీలీటర్ల మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయెట్ లీటరు నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో పంటపై పిచికారీ చేయాలి.

వేరుశనగ పంటలో...

వేరుశనగ పంటను ప్రధానంగా పొగాకు లద్దె పురుగు ఆశించే పరిస్థితులు ఉన్నాయి. పంటచేనులో పురుగును గమనించినట్లయితే దీని నివారణకు పురుగులు చిన్నగా ఉన్నప్పుడు ఎకరాకు 0.5 శాతం వేప కషాయం లేదా 5 మిల్లీలీటర్ల వేపనూనె లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల ఉపయోగం ఉంటుంది. ఎదిగిన లార్వాను నివారించడానికి 200 మిల్లీలీటర్ల నోవల్యురాన్ లేదా 40 మిల్లీలీటర్ల ఫ్లూబెండియామైడ్ ఎకరాకు సరిపోయేలా 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వేరుశనగ పంటను తిక్క ఆకుమచ్చ తెగులు కూడా ఆశించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. తెగులును గుర్తిస్తే నివారణ కోసం ఎకరాకు 2 గ్రాముల క్లోరోథాలోనిల్ లేదా ఒక గ్రాము టెబ్యుకొనజోల్ లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. మొదలు కుదుళ్లు తెగులు సైతం వేరు శనగ పంటలో దర్శనమిస్తోంది. ఈ తెగులును నివారించేందుకు 2 గ్రాముల కార్బండిజమ్, మాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లను తడపాలి.

అన్నాచెల్లెళ్లకు వంట గ్యాస్, ఆర్థికసాయం

దహెగాం: మండలంలోని చౌక గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్ల దీన గాథపై ఫిబ్రవరి 15న 'అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో దాతలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సాయమందిస్తున్నారు. ఇదే క్రమంలో రెబ్బెన మండలానికి చెందిన దేవర వినోద్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం అన్నాచెల్లెళ్లకు వంట గ్యాస్ పొయ్యి అందజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన అనిల్ అనే యువకుడు రూ.3 వేల నగదు అందించారు. కార్యక్రమంలో కొండపల్లి సర్పంచ్ సంజీవ్, ఆగర్‌గూడ సర్పంచ్ సుధాకర్, యువకులు సునీల్, సాయివర్ధన్, ప్రదీప్, నారాయణ, హరీశ్ తదితరులున్నారు.



వంట గ్యాస్, నగదు అందజేస్తున్న దాతలు

'ఉపాధి' నిధులు సకాలంలో అందించాలని ధర్నా

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు సకాలంలో ఉపాధిహామీ నిధులు అందించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ సర్పంచ్ సంఘ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినట్లు సంఘ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు చెన్న సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు అందించాల్సిన ఉపాధిహామీ నిధులను సకాలంలో అందించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి ముందుకు సాగడం లేదన్నారు. నేషనల్ సర్పంచ్ సంఘ ఆధ్వర్యంలో సర్పంచుల ధర్నాతో కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలను చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు జయరాం పల్వనియా, వివిధ రాష్ట్రాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే చర్యలు

పెంచికల్‌పేట్: బాల్యవివాహాలు చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సరిత హెచ్చరించారు. మండలంలోని ఎల్కపల్లి, బొంబాయిగూడ గ్రామాల్లో మంగళవారం బాల్యవివాహాలు చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో బాలికల కుటుంబ సభ్యులకు బాలికల సంరక్షణ అధికారులు, ఐసీడీఎస్ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బాల్యవివాహాలు చేసే కుటుంబ సభ్యులు, పెద్దలు, పూజారులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్యవివాహాలు జరిగితే 1098లో సమాచారం అందించాలని సూచించారు. ఆమె వెంట చైల్డ్‌లైన్ కౌన్సిలర్ ఝాన్సీరాణి, సీడీపీవో విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, కమలాదేవి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

'ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి'

పాతమంచిర్యాల: మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టాలని మంచిర్యాల తండాకు చెందిన బంజారా కులస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి బెల్లంపల్లి చౌరస్తావరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బంజారా కుల సంఘాల నాయకులు లాల్‌కుమార్, సపాట్ శంకర్, రత్నం తిరుపతి, లోకేశ్, రఘునాథ్‌చౌహాన్, ఇస్లావత్‌ప్రకాశ్, డాక్టర్ రాథోడ్ గణేశ్, బండి రమేశ్, జ్యోతి, సులోచన, గణపతి, సురేఖ, రాజు, రాజన్న, సుధాకర్, శ్రీకాంత్, కృష్ణ, గోవింద్, సక్‌లాల్ ధల్‌సింగ్ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం



రాజనర్సు

బెల్లంపల్లి: మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్‌గా బెల్లంపల్లికి చెందిన చిలుక రాజనర్సు నియమితులయ్యారు. ఖమ్మంలో ఈనెల 27, 28 తేదీల్లో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఆవిర్భావ సభ జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో రాజనర్సును రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్‌గా నియమించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో ప్రాతినిథ్యం కల్పించిన రాష్ట్ర నాయకులకు రాజనర్సు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ హక్కుల దండోరా ఉద్యమ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.

భీమినిలో మెగా వైద్యశిబిరం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ బాధితులకు ఈ రక్తదానం యూనిట్లు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. రక్తదాన శిబిరానికి 40 మంది దాతలు హాజరై రక్తం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్యామలాదేవి, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో రాధాకిషన్, ఎంపీవో సతీశ్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్, రేషన్ షాపు డీలర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



దాతలకు కార్డులు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్

ఉద్యానవన నర్సరీ చెట్లకు వేలం

ఆసిఫాబాద్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండలం బూదకలాన్ ఉద్యానవన నర్సరీ శిక్షణ కేంద్రంలో పెంచిన చెట్లను విక్రయించేందుకు వేలం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 1,214 వేప, 239 తుమ్మ, 638 వివిధ రకాల చెట్లను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల వారు 'ప్రాజెక్ట్‌అధికారి, ఐటీడీఏ ఉట్నూర్' పేరుతో రూ.వెయ్యి డీడీ చెల్లించాలని తెలిపారు. ఈ నెల 2వరకు టెండర్ల కోసం సీల్డ్ కవర్లు అందించాలని పేర్కొన్నారు. 3న సాయంత్రం 5.30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఓఎస్డీ, ఐటీడీఏ ఉట్నూర్‌ను 9959868998 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పిచ్చికుక్క దాడిలో మరో 15 మందికి గాయాలు

మందమర్రిరూరల్: మందమర్రిలో పిచ్చికుక్క దాడిలో మరో 15 మంది గాయపడ్డారు. పట్టణంలోని రెండో జోన్‌లో మంగళవారం ఉదయం ఇంటి ఎదుట ఉన్న మహిళను పిచ్చికుక్క కరిచింది. ఆ తర్వాత పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను కరిచి గాయపరిచింది. సుమారు 15మందిని కరిచి గాయపరచగా మున్సిపల్, సింగరేణి అధికారులు పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు పిచ్చికుక్కను వెంటాడి పట్టుకున్నారు. గాయపడ్డవారు చికిత్స కోసం సింగరేణి, ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లారు. వీరిలో కొందరిని రామకృష్ణాపూర్ ఏరియాసుపత్రికి తరలించగా మరికొందరు మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు.



కుక్క కాటుతో మహిళ చేతిపై గాయాలు

కౌటాల మండలం యాపగుడలో..

కౌటాల: పిచ్చికుక్క దాడిలో మండలంలోని యాపగూడ గ్రామానికి చెందిన చాపిడి లింగయ్యకు గాయాలయ్యాయి. ముత్తంపేట గ్రామానికి చెందిన డీ సురేశ్‌పై వీధికుక్క దాడి చేసి గాయపర్చింది. మహారాష్ట్రకు చెందిన రఘునాథ్‌పై కౌటాలలో పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. ఈ ముగ్గురికి కౌటాల పీహెచ్‌సీలో వైద్యం అందించారు.

మన ఊరు-మనబడి పనుల పరిశీలన

నెన్నెల: గొల్లపల్లి, మైలారం గ్రామాల్లో చేపట్టిన 'మన ఊరు-మన బడి' పనులను మంగళవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు తగిన నీటివసతి కల్పించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. గొల్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఆవరణ అంతా తిరిగి చూశారు. రాష్ట్ర సాంకేతిక బృందం చేపట్టే డాక్యుమెంటరీని పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. పంచాయతీకి జాతీయ స్థాయిలో అవార్డు దక్కాలంటే ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో సాంకేతిక బృందానికి వివరించారు. ఆయన వెంట డీపీవో ఫణీందర్‌రావు, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం లింగయ్య, సర్పంచ్ ఇందూరి శశికళ ఉన్నారు.



గొల్లపల్లి పాఠశాల పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

గొల్లపల్లికి జాతీయ అవార్డు దక్కేందుకు కృషి

నెన్నెల: గొల్లపల్లి గ్రామపంచాయతీ రాష్ట్ర స్థాయి పంచాయతీ అవార్డుకు ఎంపికైందని డీపీవో ఫణీందర్‌రావు తెలిపారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సహకారంతో గ్రామపంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు దక్కేందుకు కృషి చేస్తామని చెప్పారు. మంగళవారం ఆయన గొల్లపల్లిని సందర్శించారు. రాష్ట్ర సాంకేతిక బృందం డ్రోన్ కెమెరా ద్వారా తీసే విలేజ్ ప్రొఫైల్ వీడియో డాక్యుమెంటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాంకేతిక బృందం ఆసరా పింఛన్, రేషన్ బియ్యం సరఫరా, అంగన్‌వాడీల నిర్వహణ, మెడికల్ క్యాంపులో దివ్యాంగులకు అందే లబ్ధి, గ్రామాభివృద్ధి గురించి చేసిన డాక్యుమెంటరీని రాష్ట్ర పంచాయతీ కమిషన్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఉత్తమ గ్రామపంచాయతీలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అవార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ ఇందూరి శశికళ, పంచాయతీ కార్యదర్శులు రంజిత్, పద్మనాభం, సతీశ్ ఉన్నారు.



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న డీపీవో

సాగునీటి కోసం కాంగ్రెస్ ఆమరణ దీక్ష

దండేపల్లి: కడెం ఆయకట్టుకు కడెం ప్రాజెక్ట్‌తోపాటు, గూడెం ఎత్తిపోతల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందించాలని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. యాసంగికి కడెం ప్రాజెక్ట్ నుంచి డీ-1నుంచి డీ-28వరకు, గూడెం ఎత్తిపోతల నీటిని డీ-30 నుంచి డీ-42 వరకు అందిస్తామని ప్రకటించినప్పటికీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందలేదని తెలిపారు. దీంతో పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంజేశారు. గూడెం ఎత్తిపోతల పథకం యాసంగి ప్రారంభం నుంచి తరచూ మొరాయిస్తోందని, దీంతో ఎత్తిపోతలను నమ్ముకుని పంట సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గూడెం ఎత్తిపోతల పైప్‌లైన్‌కు శాశ్వత మరమ్మతు చేయిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ దీక్ష విరమించబోమని తేల్చి చెప్పారు. దీక్షలో 16 మంది రైతులతో పాటు, పలువురు కాంగ్రెస్ నాయకులు కూర్చున్నారు. జెడ్పీటీసీ నాగరాణి, కాంగ్రెస్ సర్పంచులు చంద్రకళ, పుష్పలత, శంకరయ్య, శాంతయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, నవీన్, మాలిక, హేమలత, ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, కాంగ్రెస్ మండలాధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులున్నారు.



ఆమరణ దీక్షలో కాంగ్రెస్ నాయకులు, రైతులు

సీఎల్పీ నేత సంఘీభావం

సాగునీటి కోసం దండేపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఫోన్‌లో సంఘీభావం తెలిపారు. పార్టీ మండల సీనియర్ నాయకుడు త్రిమూర్తికి రాత్రి ఫోన్ చేశారు. వీడియో కాల్ ద్వారా ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ నాయకులతో పాటు దీక్ష శిబిరం వద్ద ఉన్న రైతులతో వీడియోకాల్‌లో మాట్లాడారు. ఎవరైనా అధికారులు వచ్చారా? అని అడిగి తెలుసుకున్నారు. దీక్షకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.

ఎస్వోటు జీఎం సేవలు అభినందనీయం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఎస్వోటూ జీఎంగా విధులు నిర్వహించిన చిలకబత్తుల కృష్ణారావు సేవలు అభినందనీయమని ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ సేవామితి అధ్యక్షురాలు లక్ష్మీశ్రీనివాస్ కొనియాడారు. మంగళవారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఏరియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణారావు-లక్ష్మి దంపతులను శాలువాతో సన్మానించారు. సింగరేణిలో 34 ఏళ్లు విధులు నిర్వహించిన కృష్ణారావు దంపతులు శేషజీవితం ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, ఆఫీస్ ఓఎస్ రాజలింగు, జీఎం ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.



కృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న జీఎం

శ్రీరాంపూర్ ఏరియాలో 114 శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనుల్లో ఫిబ్రవరిలో 114 శాతం ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో ఉత్పత్తి లక్ష్యం 5.35 లక్షల టన్నులు కాగా, 6.11 లక్షల టన్నులు సాధించి 114 శాతం లక్ష్యం నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. 2022 ఏప్రిల్ 1నుంచి ఉత్పత్తి లక్ష్యం 60.62 లక్షల టన్నులకు గాను 59.07 లక్షల టన్నులు సాధించి 97 శాతం లక్ష్యం చేరుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఉత్పత్తి లక్ష్యం 66.40 లక్షల టన్నులని, వానాకాలంలో స్టోవింగ్ గనుల్లో ఇసుక, ఫ్లై యాష్ నింపడం ఇబ్బందిగా మారిందని, ఈసారి వేసవిలోనే తగినంతా స్టాక్ చేస్తున్నామన్నారు. 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా మూడు కొత్త టెండర్లు పిలిచామన్నారు. ఎస్సార్పీ 3 గనిలో గ్యాస్ ప్రమాదంతో గనిని మూసి వేసి లే ఆఫ్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన 16 గంటల్లోనే దీన్ని కట్టడి చేయడం జరిగిందన్నారు. డివిజన్‌లో ఫిబ్రవరిలో 32 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశామన్నారు. అర్హులకు డైలీ రేటెడ్, మంత్లీ రేటెడ్ ప్రమోషన్లు ఇచ్చినట్లు చెప్పారు. కీళ్లనొప్పులు, ఇతర ప్రమాదాలతో ఏరియా ఆసుపత్రికి వెళ్లి ఫిజియోథెరపీ చేసుకొనేవారి కోసం ఆర్కే 8 డిస్పెన్సరీలోనే దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్వోటూ జీఎం త్యాగరాజు, డీజీఎంలు (పర్సనల్) గోవిందరాజు, అరవిందరావు, సీనియర్ పీవో తుకారాం పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గుగ్గిళ్ల సత్యంతో కలిసి అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్, మండల పరిషత్ అభివృద్ధి, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ పనులు అధికారులతో సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదిక అందించాలని తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధులతో చేసిన పనులపై మడిపల్లి పద్మావతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: వైద్యారోగ్యశాఖ కమిషనర్ ద్వారా 10 రకాలకు సంబంధించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అవగాహన పోస్టర్‌ను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వయోవృద్ధుల సంరక్షణ, డయాబెటిస్, బీపీ, క్యాన్సర్ల నిర్ధారణ లాంటి అసంక్రమణ వ్యాధులను గుర్తించాలన్నారు. లింగనిర్ధాణ చేయడం నేరమని, టీడీపై అవగాహనతో పాటు ఇతరత్ర వ్యాధులపై అవగాహన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ విజయపూర్ణిమ, విజయనిర్మల, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డీపీవో ప్రశాంతి, నాందేవ్, రామమూర్తి, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుబ్బరాయుడు



కలెక్టర్‌తో ఎమ్మెల్యే సెల్ఫీ

మంచిర్యాల పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం సంత్ సేవాలాల్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు. కాగా, వేదికపై ఎమ్మెల్యే చిన్నయ్య కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో సరదాగా ఓ సెల్ఫీ తీసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల